సాక్షి
వికారాబాద్
ఆదివారం । 2 । జూన్ । 2024



కౌంట్‌డౌన్

లోక్‌సభ తుది విడత ఎన్నికలు శనివారంతో ముగిశాయి. మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. 8లో▸



ఆర్‌ఓ పెరుగుదల..

సిబ్బంది కృషి ఫలితంగానే తాండూరు ఆర్టీసీ డిపో ఓఆర్ పెరిగిందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. 8లో▸



సరికొత్త సొబగులు

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. భవనాలకు రంగులు వేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సత్వరం పనులు పూర్తి చేయండి

విద్యాశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ రమేశ్



బొంరాస్‌పేట పాఠశాలలో తాగునీటి వసతిని పరిశీలిస్తున్న రమేశ్, రేణుకాదేవి

బొంరాస్‌పేట: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రమేశ్ (ఏఎస్‌పీడీ) రమేశ్ ఆదేశించారు. శనివారం మండలంలోని బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొడంగల్‌లోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. బొంరాస్‌పేటలో మహిళా సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, ఎంఈఓ రాంరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



మాట్లాడుతున్న డీఏఓ గోపాల్

మోమిన్‌పేట: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ లైసెన్సు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదులు కూడా తీసుకోవాలని రైతులకు సూచించారు. పత్తి విత్తనాలపై అపోహలు వద్దని, అనవసరంగా బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసి మోసపోరాదన్నారు. ఎరువుల దుకాణం యజమానులు స్టాక్ వివరాలను బోర్డుపై నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాకు సరిపడా పత్తి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఓ జయశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

పౌరసరఫరాల శాఖ డీఎం సుగుణాబాయి




రేషన్ డీలర్లతో సమావేశమైన అధికారులు

తాండూరు: రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ డీఎం సుగుణాబాయి హెచ్చరించారు. శనివారం తాండూరు శివారులోని సివిల్ సప్లై గోదాంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో బియ్యం నిల్వలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాలన్నారు. పలువురు డీలర్లు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయకుండా బియ్యం విలువ కట్టి డబ్బులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం గోదాంలో బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.

5న డీఎస్సీపై అవగాహన సదస్సు

అనంతగిరి: వికారాబాద్‌లోని ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈనెల 5న డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్య నిపుణులు వైజాగ్ రవి, కాకినాడ దుర్గాప్రసాద్ వస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు డీఎస్సీకి ఎలా ప్రిపేర్ కావాలి, సిలబస్ తదితర అంశాలపై అవగాహన ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9441022571లో సంప్రదించాలన్నారు.





పరిగి మండలంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్

దశాబ్ది ఉత్సవం

ప్రగతి పథం

నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

పదేళ్ల కల నెరవేరిన వేళ	ప్రజలకు చేరువైన ప్రభుత్వ పాలన	రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల
రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు	సీఎం నియోజకవర్గానికి రూ.4,369 కోట్లు కేటాయింపు	ఉద్యమాల గడ్డకు సముచిత స్థానం

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కొడంగల్ ప్రాంతానికి గడిచిన ఆరు నెలల్లో రూ.4,369 కోట్ల విలువైన 20 పనులకు పరిపాలనా అనుమతులు లభించాయి. గతంలో జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ పురపాలక సంఘాలకు కేసీఆర్ ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులు రుణం రూపంలో కేటాయించారు. తాండూరు పట్టణానికి ప్రధాన సమస్యగా మారిన భారీ వాహనాల రద్దీని తగ్గించేందుకు రూ.74 కోట్లతో రింగ్ రోడ్డు వచ్చింది. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి కొడంగల్ నుంచి మన్నెగూడ వరకు విస్తరణ పూర్తయింది. మన్నెగూడ నుంచి

అభివృద్ధికి భారీగా నిధులు

అప్పా కూడలి వరకు విస్తరణకు సుమారు రూ.900 కోట్లు మంజూరయ్యాయి. భూసేకరణ జరుగుతోంది. మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వికారాబాద్ పట్టణ ప్రజలకు ప్రధాన అడ్డంకిగా మారిన రైల్వే పైవంతెన విస్తరణకు రూ.70 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ప్రజలు ఆహ్లాదంగా సమయం గడిపేందుకు సుమారు రూ.20 కోట్లతో నాలుగు మినీ ట్యాంక్ బండ్లను నిర్మించారు. జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేయడానికి 5 ఎకరాల స్థలం, అవసరమైన నిధులను కేటాయించారు. దీర్ఘకాలంగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మంజూరు చేశారు.

నేటి కార్యక్రమాలు

- ఉదయం 8:35 నిమిషాలకు వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ముందున్న అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్, అధికారులు నివాళులర్పిస్తారు
- 8:55 నిమిషాలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రాంగణానికి ఎస్పీ కోటిరెడ్డి, 8: 58 నిమిషాలకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేరుకుంటారు
- 9గంటలకు కలెక్టర్ పతాకావిష్కరణ చేస్తారు
- 9:05 నిమిషాలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు
- 9:10 నిమిషాలకు తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు సన్మానం
- 9:30 నిమిషాలకు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- 10గంటలకు జాతీయ గీతాలాపనతో కార్యక్రమాలు ముగుస్తాయి

వికారాబాద్: ప్రత్యేక తెలంగాణ, వికారాబాద్ జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కలలు నెరవేరాయి. కలెక్టరేట్ రాక, కొత్త మండలాల ఏర్పాటుతో పాలన జనానికి చేరువైంది. రాష్ట్ర సాధన కోసం ఇక్కడి ప్రజలు చేసిన ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసాయి. సమయం చిక్కినప్పుడల్లా ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలకులను అడ్డుకోవడం.. నిరసన కార్యక్రమాలతో ప్రజల అభిప్రాయానికి అద్దం పట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. అనుకున్నది సాధించారు. స్వపరిపాలనలో పదేళ్లు గడిచిపోయాయి. ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే ఎన్నో మధుర జ్ఞాపకాలు.. అభివృద్ధి, అవకాశాల్లో ఎంతో మార్పు కళ్లెదుట కనిపిస్తుంది.

'మిషన్ కాకతీయ'తో..

జిల్లాలో 1,138 చెరువులు ఉండగా మిషన్ కాకతీయ పథకం కింద పూడిక తీత పనులు చేపట్టారు. దీంతో చెరువుల్లో నీటి సామర్థ్యం పెరిగింది. జిల్లాలో మూడు వేల పైచిలుకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. వెయ్యి పైచిలుకు చివరి దశలో ఉన్నాయి. గడిచిన ఆరేళ్ల కాలంలో పేదలకు ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేకపోయారు.

కొడంగల్‌పై ప్రత్యేక ఫోకస్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఏకైక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్‌లో ఏర్పాటు చేశారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం రూ.4,369 కోట్ల విలువైన 20 పనులకు పరిపాలనా పరమైన అనుమతులు మంజూరయ్యాయి.

ఉద్యమాల గడ్డ..

ఉమ్మడి రంగారెడ్డిలో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతంగా నడిపించింది మాత్రం వికారాబాద్ ప్రాంతమనేది స్పష్టం. విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు అందరు ఏకతాటిపై ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధుల పర్యటనలను అడ్డుకోవడం, మంత్రుల వాహన శ్రేణిపై కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేయడం వంటి సంఘటనలు ఇప్పటికి గుర్తుచేసుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో నగరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాలు ప్రపంచంలోనే అత్యున్నత నగరాలతో అభివృద్ధిలో పోటీ పడుతుండగా, వికారాబాద్ ప్రాంతాన్ని ఎవరూ పట్టించుకోకుండా అనాధగా మిగిలిపోయిందన్న భావన ఉండేది. తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక జిల్లాతోనే అభివృద్ధి సాధ్యమని ఇక్కడి ప్రజలు గట్టిగా నమ్మేవారు.
ఆ కల సాకారమైంది.



ప్రత్యేక జిల్లాగా..

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నాలుగు నియోజకవర్గాలు, 18 మండలాలతో వికారాబాద్ ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైంది. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలు వికారాబాద్ జిల్లాలో చేరాయి. పరిగి నియోజకవర్గం నుంచి గండీడ్ మండలాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో చేర్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బషీరాబాద్, తాండూరు, బంట్వారం, పెద్దేముల్ మండలాల ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే పెద్ద వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారంగా ఉండేది. వికారాబాద్ జిల్లాగా ఏర్పాటైన తరువాత ప్రజలకు ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగం అందుబాటులోకి వచ్చిందనే చెప్పాలి. జిల్లా కేంద్ర మైన వికారాబాద్ పట్టణంలో సుమారు రూ.50 కోట్లతో నూతన సమీకృత కలెక్టరేట్ భవనం నిర్మించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వచ్చాయి. పరిగి, కొడంగల్ గ్రామ పంచాయతీలు పురపాలక సంఘాలుగా ఏర్పాటయ్యాయి. 18 మండలాలతో వికారాబాద్ జిల్లా ప్రజాపరిషత్ ఏర్పాటైంది. వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో కొత్తగా ఏడు గ్రామాలు విలీనం అయ్యాయి. సుమారు 108 తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించారు. పరిగి నియోజవర్గంలో చౌడాపూర్ కొత్త మండలంగా ఏర్పాటైంది.

అనేక అభివృద్ధి కార్యక్రమాలు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా నూతన కలెక్టరేట్ భవన సముదాయం, మెడికల్ కళాశాల, అనుబంధంగా 250 పడకలతో జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటు చేశారు. అనంతగిరి ఏకో టూరిజం పార్కు మంజూరైంది. జిల్లా కేంద్రంలో రైల్వే ఫ్లై ఓవర్ మంజూరు చేశారు. తాండూరులో నర్సింగ్ కళాశాల, జిల్లాలో మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలురు, బాలికలు కలుపుకొని మొత్తం 20 గురుకులాలు ఏర్పాటు చేశారు. వాటికి నూతన భవనాలు నిర్మించాల్సి ఉంది. పరిగి పట్టణానికి 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి మంజూరైంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరా జరుగుతోంది. ఇటీవల కొడంగల్‌లో సుమారు రూ. 3,700 కోట్లతో సాగునీటి కోసం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, వైద్య కళాశాల, వ్యవసాయ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, ఇంటర్ కళాశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో 97 రైతు వేదికలు నిర్మించారు. ప్రతి గ్రామ పంచాయతీలో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు నిర్మించారు.



అనంతగిరి: ఆవిర్భావ వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ

మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్

పరిగి: అమరుల త్యాగాలతోనే తెలంగాణ సాధ్యమైందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ కృషి, అమరుల త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమరులను విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, నాగేశ్వర్, రవికుమార్ పాల్గొన్నారు.




అమరవీరులకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాజకీయంగా ప్రాధాన్యత

ప్రత్యేక రాష్ట్రంలో వికారాబాద్ జిల్లాకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిగి మాజీ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేయగా, ప్రత్యేక తెలంగాణలో తాండూరు మాజీ ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డి రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో శాసన సభలో కీలకమైన రెండు పదవులు వికారాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులకే దక్కాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మర్పల్లి మండలానికి చెందిన మర్రి చెన్నారెడ్డి (1989–90) ముఖ్యమంత్రిగా పనిచేశారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎ.చంద్రశేఖర్ మంత్రిగా పనిచేశారు.

అవమానాలను భరించాం



తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాం. రాష్ట్రం ఏర్పడక ముందు తాండూరులో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు బలంగా ఉన్నాయి. ఉద్యమ లొలినాళ్లలో పార్టీల నుంచి కానీ, ప్రజల నుంచి కానీ మద్దతు లభించలేదు. దీంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు, ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరంతో కలిసి జేఏసీని ఏర్పాటు చేశాం. తాండూరులో ఉద్యమాన్ని ఉధృతం చేశాం. గ్రామ స్థాయిలో ప్రజలను చైతన్యం చేయడం జరిగింది. తర్వాత రాజకీయ పార్టీలు జత కట్టడం, అన్ని వర్గాలు, కుల సంఘాలు మాతో కలసి ఉద్యమబాట పట్టాయి. జేఏసీ పోరాట పటిమతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం తమను గుర్తించడం ఎంతో సంతోషంగా ఉంది.

– సోమశేఖర్, టీజేఏసీ అధ్యక్షుడు, తాండూరు నియోజకవర్గం



తెలంగాణ ఉద్యమ సమయంలో చలో హైదరాబాద్‌కు తరలిన నిరసనకారులు

క్లుప్తంగా

గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్ : గోశాలలో గోవుల కోసం నిల్వ చేసిన గడ్డివాము దగ్ధమైన ఘటన శనివారం తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఫైర్ హెడ్ కానిస్టేబుల్ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గగరాణి ఫంక్షన్ హాల్‌ను ఆనుకుని గడ్డివాము ఉంది. అయితే, శనివారం ఒక్కసారిగా గడ్డివాము నుంచి మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రూ. 45 వేల మేరకు గడ్డి దగ్ధమైనట్లు తెలిపారు.

తొవ్వి వదిలేశారు..

దుద్యాల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలోని కుదురుమల్ల గ్రామం నుంచి దుద్యాల్‌కు వెళ్లే మార్గంలో ఆలేడ్ గ్రామ సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారిందని గత సంవత్సరం క్రితం రోడ్డును తొలగించారు. ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు రోడ్డు వేయకుపోవడంతో ఆ దారి వెంబడి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఆ రోడ్డు మరి దారుణంగా తయారైంది. వానాకాలంలో వానలు తీవ్రంగా కురిస్తే రాకపోకలకు మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ధారూరు మార్కెట్‌కు 1,275 మొక్కజొన్న బస్తాలు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం మొక్కజొన్న 1,275 బస్తాలు రాగా క్వింటాల్‌కు రూ. 2,170 నుంచి రూ. 2,340 వరకు ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ పేర్కొన్నారు. అలాగే, దొడ్డు రకం ధాన్యం బస్తాలు 1,106 రాగా క్వింటాల్‌కు రూ. 2,100 నుంచి రూ. 2,110 వరకు అమ్మకాలు జరిగాయని చెప్పారు. సన్నరకం ధాన్యం 1,623 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ. 2,280 నుంచి రూ. 2,440 వరకు కొనుగోళ్లు జరిగినట్లు ఆమె తెలిపారు.

హుండీ పగులగొట్టి నగదు చోరీ



హుండీని బయట పడేసిన దుండగులు

మొయినాబాద్: ఆలయంలోని హుండీ పగులగొట్టి అందులోని నగదును గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని సురంగల్ కట్టమైసమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సురంగల్ గ్రామ సమీపంలో ఉన్న కట్టమైసమ్మ దేవాలయాన్ని గతేడాది పునఃనిర్మాణం చేపట్టారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని దుండగులు కట్టకిందికి తీసుకెళ్లి అందులోని నగదును దోచుకున్నారు. శనివారం ఉదయం అటువైపు వెళ్లిన గ్రామస్తులు ఆలయంలో హుండీ లేదని గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

మహిళ అదృశ్యం

మాడ్గుల: మండలంలోని ఓ మహిళ అదృశ్యమైన ఘటన నల్లవారిపల్లిలో చోటు చేసుకుంది. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. నల్లవారిపల్లికి చెందిన మేడల మమత గత నెల 4న ఇద్దరు పిల్లలను వదిలి, ఒక పాపను తన వెంట తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం లభించలేదు.. ఆమె భర్త దశరథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

కౌంట్‌డౌన్

- 4న చేవెళ్లలోని బీఎస్ఐటీలో కౌంటింగ్
- ఎంపీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు 25 టేబుళ్లు, రెండు రౌండ్లు



సమీక్ష సమావేశంలో రిటర్నింగ్ అధికారి శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: లోక్‌సభ తుది విడత ఎన్నికలు శనివారంతో ముగిశాయి. మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. చేవెళ్ల మండలం గొల్లపల్లి శివారులోని బండారి శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో(బీఎస్ఐటీ) ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. ఏ, బి–బ్లాక్‌లలో గ్రౌండ్ ఫ్లోర్ సహా ఒకటి, రెండు, మూడో అంతస్తుల్లోని విశాలమైన హాల్స్‌లో ఈ లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 2,877 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. ఇందుకు మొత్తం 165 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో మొత్తం 777 మంది సిబ్బంది పాల్గొననున్నారు. వీరిలో కౌంటింగ్ సూపర్ వైజర్స్ 227 మంది ఉండగా, కౌంటింగ్ అసిస్టెంట్స్ 273, మైక్రో అబ్జర్వర్లు 277 మంది ఉన్నారు. ఇప్పటికే వీరికి శిక్షణ ఇచ్చారు. వీరంతా జూన్ 4న ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోనున్నారు. ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రక్రియను ప్రారంభించనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్(19,290) ఓట్లు లెక్కించనున్నారు. ఇందుకోసం 25 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థులతో పాటు ఆయా పార్టీ కార్యకర్తల్లో టెన్షన్ మొదలైంది. ఓటింగ్ తర్వాత విదేశాలు, విహార యాత్రలకు వెళ్లిన అభ్యర్థులతో పాటు పోలింగ్ ఏజెంట్లు ఇప్పటికే సొంత గడ్డకు చేరుకున్నారు.

మూడంచెల భద్రత

లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక చెప్పారు. ఈ మేరకు శనివారం ఆయన చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బీఎస్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లోని కంట్రోల్ రూంలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక, వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతిలతో కలిసి కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని.. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలాంటి వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం 5.30 నుంచి ఆరు గంటల్లోగా అబ్జర్వర్ సమక్షంలో ర్యాండమైజేషన్ చేసి టేబుల్స్ కేటాయిస్తారని వివరించారు. ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో జూన్ 4న ఉదయం స్ట్రాంగ్ రూములను తెరుస్తామన్నారు. ఓట్ల లెక్కింపునకు మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 28 టేబుళ్లు, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరులకు సంబంధించి 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అబ్జర్వర్ సమక్షంలో ఐదు వీవీ ప్యాట్స్ రాండమ్ గా ఎంపిక చేసి స్లిప్పులను లెక్కిస్తారన్నారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సిబ్బందిని, ఇతర సిబ్బందిని నియమించామన్నారు. ప్రతీ రౌండ్ పూర్తవగానే ఎంకోర్ యాప్‌లో డాటా నమోదు చేస్తామని.. కేంద్రం వద్ద అఫీషియల్ కమ్యూనికేషన్ రూమ్, మీడియా సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఆర్‌ఓ వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏఆర్ ఓలు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుల్స్, రౌండ్లు

నియోజకవర్గం	కౌటింగ్ సెంటర్	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్లు	సిబ్బంది
మహేశ్వరం	బ్లాక్ బి, 1వ అంతస్తు	537	28	20	87
రాజేంద్రనగర్	బ్లాక్ ఎ, 2వ అంతస్తు	543	28	20	87
శేరిలింగంపల్లి	బ్లాక్ బి, గ్రౌండ్ ఫ్లోర్	633	28	23	87
చేవెళ్ల	బ్లాక్ ఎ, 1వ అంతస్తు	298	14	22	45
పరిగి	బ్లాక్ బి, 2వ అంతస్తు	305	14	22	45
వికారాబాద్	బ్లాక్ బి, 2వ అంతస్తు	284	14	21	45
తాండూరు	బ్లాక్ బి,3వ అంతస్తు	277	14	20	45
పోస్టల్ బ్యాలెట్	బ్లాక్ ఎ, 1వ అంతస్తు	-	25	2	78

తీగలు ఎత్తుకెళ్తున్నారు!

- పొలాల్లో చొరబడుతున్న దుండగులు
- రాత్రివేళలో చోరీలు
- నష్టపోతున్న రైతులు



ఈర్లపల్లి సమీపంలో స్టార్టర్‌ను ధ్వంసం చేసిన దొంగలు

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో శివారులోని పొలాల్లో విద్యుత్ తీగలు, పరికరాలు చోరీకి గురవుతున్నాయి. రాత్రి వేళల్లో గుర్తుతెలియని దుండగులు చేలల్లోని బోరుమోటార్లకు ఉన్న విద్యుత్ సరఫరా చేసే కేబుల్, సర్వీస్ తీగలను కత్తిరించుకుని వెళ్తున్నారు. ఇటీవల గుండేపల్లి, ఈర్లపల్లి, దౌల్తాబాద్ గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో దాదాపు 30మందికి చెందిన చేలల్లో కేబుల్ తీగలు, కాపర్ ఫ్యూజులు, స్టాటర్లు చోరీకి గురయ్యాయని రైతులు పేర్కొంటున్నారు. అలాగే, ట్రాన్స్‌ఫార్మర్లలోని అయిల్ చోరీకి గురవుతోంది. పదిహేను రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన బక్కని ఎల్లప్ప పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో అయిల్ చోరీకి గురయింది. పంటలకు నీరందించేందుకు పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడుతున్న రైతులు కేబుల్ వైర్ల దొంగతనాలతో ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై గతంలో పోలీసులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు.. ఒక్కొక్కరి చేలలో 10–20మీటర్ల తీగలు ఎత్తుకెళ్లడంతో ప్రతిసారి రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయిల్ చోరీ అయితే, సుమారు రూ.5వేలు ఖర్చువుతుందంటున్నారు.

అదును చూసి..

దొంగలు అదును చూసి రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో అయితే పొలాల్లో ఎవరూ ఉండని తెలుసుకుని చోరీకి పాల్పడుతున్నారు. మోటార్ల తీగలు, సర్వీస్ వైర్లు, కాఫర్ ఫ్యూజులు, స్టార్టర్ పరికరాలు ఎత్తుకెళ్తున్నారు. ఇలా దొంగిలించిన సామాగ్రి తీగలను తుక్కు దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు సామాచారం. అసలే పంట నష్టాలతో ఆర్థికంగా నష్టపోతున్న రైతులకు వ్యవసాయ పొలాల్లో తీగలు, పరికరాలు సైతం దోచుకెళ్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. పోలీసులు వీటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

రైతులను చైతన్య పరచాలి

- పోలీసులు, డీలర్లు సహకరించాలి
- గడువు ముగిసిన విత్తనాలు అమ్మడం సరికాదు
- వ్యవసాయ శాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి

తాండూరు రూరల్: తాండూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా ఫర్టిలైజర్స్,ఫెస్టిసైడ్ డీలర్లు రైతులను చైతన్య పర్చాలని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి పేర్కొన్నారు. శనివారం తాండూరు మండల ఏఓ రజిత ఆధ్వర్యంలో బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాలకు చెందిన ఫర్టిలైజర్స్,ఫెస్టిసైడ్ డీలర్లతో నకిలీ విత్తనాల కొనుగోలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రుద్రమూర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో నకిలీ విత్తనాలపై ఇప్పటికే వ్యవసాయ విస్తరణ అధికారులతో మే 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అవగాహన రైతులకు అవగాహన కల్పించామన్నారు. అయినప్పటికీ కొంత మంది రైతులు బషీరాబాద్ మండలంలోని ఏక్మాయి, మంతట్టి, యాలాల పరిధిలోని రాస్నం గ్రామాల్లో నకిలీ విత్తనాలు పట్టుబడటం సిగ్గుచేటన్నారు. ఫర్టిలైజర్స్ ,ఫెస్టిసైడ్ వ్యాపారులు రైతులను చైతన్య పర్చాకపోవడం వలనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. రసాయనిక, క్రిమి సంహారక మందులు అమ్మే వ్యాపారులను రైతులు నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారని..వారు రైతులను చైతన్య పర్చాడం వల్లనే రైతుల్లో మార్పు వస్తోందన్నారు. తాండూరు పట్టణ పరిధిలోని కొందరు వ్యాపారులు కూరగాయాల విత్తనాలకు సంబంధించి గడువు ముగిసినప్పటికీ కూడా విత్తనాలు అమ్ముతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. తాను ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసిన ఈ -పాస్ విధానం అమలు చేయడం లేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు ముగిసిన విత్తనాలు, రసాయన ఎరువులను అమ్మితే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. తాండూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బషీరాబాద్, యాలాల,పెద్దేముల్, తాండూరు మండలాల్లో 40 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసే అవకాశం ఉందన్నారు. అందుకోసం డీలర్లు రైతులకు పత్తివిత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు విత్తనాలు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ రిజిస్ట్రార్ మెయిటైన్స్ చేయాలని .. కోనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. తాండూరు రూరల్ సీఐ ఎన్.అశోక్ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం కల్తీ విత్తనాలపై సీరియస్‌గా ఉందని ఫర్టిలైజర్ వ్యాపారులు రైతు లకు నాణ్యమైన విత్తనాలు అమ్మలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు రజిత ,సూర్యనారాయణ ,యాదగిరి ,నసిరోద్దిన్, ఏఈఓ, డీలర్లు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో మేకల మృతి

- పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలు
- గత ఆదివారం నుంచి భయాందోళనలో రైతులు
- విద్యుత్ స్తంభాలు, తీగలు తొలగించాలని వినతి



షాక్‌తో మృతి చెందిన మేకలు

ధారూరు: వ్యవసాయ పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మూడు మేకలు మృతి చెందిన ఘటన మోమిన్‌కలాన్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు రఘునందన్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ తీగలు గాలి దుమారానికి తెగిపడ్డాయి. అక్కడే మేత మేస్తున్న మూడు మేకలు తెగిపడిన తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందాయి. మృతి చెందిన మేకల విలువ రూ. 35 వేలు ఉంటుందని బాధితుడు రఘునందన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడం, నేరుగా విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కనెక్షన్ ఉండటంతోనే తరుచు ప్రమాదాలకు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఏ ప్రమాదం జరిగిన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేయాల్సి ఉంటుందని, అక్కడ ఫోన్ సకాలంలో లేపకపోవడం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరఫరా బంద్ చేయాలని కోరితే వెంటనే బంద్ చేయరని, లైన్ కనెక్ట్(ఎల్‌సీ) తీసుకుంటేనే నిలిపివేస్తారని అన్నారు. దీంతో జరగాల్సిన నష్టం జరిగిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఎల్‌సీ తీసుకుంటే మోమిన్‌కలాన్‌తో పాటు రాజాపూర్, మోమిన్‌ఖుర్దు గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. ఇప్పటికైనా వ్యవసాయ కనెక్షన్లు ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని వారు కోరుతున్నారు.

ఇంకా కనిపిస్తున్న తెగిపడిన తీగలు

వ్యవసాయ పొలాల్లో ఇంకా తెగిపడిన తీగలు కన్పిస్తూనే ఉన్నాయి. గత ఆదివారం నుంచి ఇంకా వ్యవసాయ పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, పడిపోయిన స్తంభాలు కన్పిస్తూనే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరా నిలిపివేశామని చెబుతున్నా మేతకు వెళ్లిన పశువులు, మేకలు చనిపోతూనే ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని, ఉన్నతాధికారులు తగిన చొరవ తీసుకుని వెంటనే విద్యుత్ లైన్లు మరమ్మతులు వారు కోరారు.

సీఎం, మంత్రికి ట్విట్టర్‌లో ఫిర్యాదు

ధారూరు: సీఎం రేవంత్‌రెడ్డి, ఫారెస్టు మినిస్టర్ కొండా సురేఖ, ఫారెస్టు పీసీసీఎఫ్, సీసీఎఫ్‌లకు శనివారం ఫ్రెండ్స్ యూత్ అసోషియేషన్ సభ్యుడు నరేష్ ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. 'బీడీ లీఫ్ బోనస్ డబ్బులు పక్కదారి' అనే శీర్షికతో శనివారం సాక్షిలో వచ్చిన వార్తకు ఆయన స్పందించాడు. తన ఫిర్యాదులో పేపర్ కట్టింగ్ జోడించారు. ఫారెస్టు రేంజ్‌ల్లో తునికాకు సేకరణ కూలీలకు వచ్చే వేలాది రూపాయల బోనస్ డబ్బులను ఫారెస్టు అధికారులు పక్కదారి పట్టించి స్వాహ చేశారని నరేష్ తన ట్విట్టర్ వేదికగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

వసతులు కల్పించాలి

అనంతగిరి: కలెక్టర్ కార్యాలయంలో సందర్శకులకు వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పార్కింగ్ స్థలంలో షెడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ధర్నా స్థలం కేటాయించడంతో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కుల్కచర్ల: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన కుల్కచర్ల మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం.. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన రాధిక(24), అనారోగ్యం కారణంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయమై మృతురాలి సోదరుడు రఘునాథ్ మా చెల్లెలు మృతిపై ఆమె భర్త కుటుంబీకులపై అనుమానం ఉన్నదని వారిపై కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని ఆత్మహత్య

అనంతగిరి: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ శంకరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం నవాబ్‌పేట మండలం మమ్మదాన్‌పల్లి గ్రామ సమీపంలోని రైల్వేలైన్‌పై ఓ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని ఒంటిపై తెల్ల చుక్కలది బ్లూ కలర్ షర్ట్, ఆరెంజ్ కలర్ బనియన్, క్రీం కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద పటాన్‌చెరుకు సంబంధించిన బస్ టికెట్ ఉందని చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే వెంటనే వికారాబాద్ రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉప ఎన్నిక ఫలితంపై ఉత్కంఠ

- గెలుపుపై అభ్యర్థుల ధీమా
- నేడే మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు



ఓటేసినట్లు చూపుతున్న ఎంపీటీసీ సభ్యులు (ఫైల్)

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన వెంటనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను ఈసీ జూన్ 2కి వాయిదా వేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఐదు టేబుళ్లపై లెక్కింపు

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఆయన పదవికి రాజీనామా చేశారు. ఖాళీ ఏర్పడిన ఈ స్థానానికి మార్చిన 28న ఉప ఎన్నిక జరిగింది. బీఆర్‌ఎస్ నుంచి నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ తలపడ్డారు. ఈ ఎన్నికలో ఎక్స్ అఫిషియో సభ్యులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మొత్తం 19 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ పరిధిలో మొత్తం 83 మంది జెడ్పీటీసీ సభ్యులులు, 449 మంది కౌన్సిలర్లు , 886 మంది ఎంపీటీసీ సభ్యులు ఓట్లు వేశారు. మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా 1,437 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఐదు టేబుళ్ల పై ఈ ఓట్లను లెక్కించనున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో ఎవరైనా అభ్యర్థి గెలిస్తే మధ్యాహ్నం లోపు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే సాయంత్రం వరకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

లెక్కింపు ఇలా

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక టేబుల్‌లో 237 ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కిస్తారు. వీటిలో చెల్లని ఓట్లు, చెల్లిన ఓట్లను వేరు చేస్తారు. తర్వాత మొదటి ప్రాధాన్యతన ఓట్లు లెక్కించి పోలైన ఓట్లలో సగాని కంటే ఎక్కువగా వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. లేదంటే రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కించి సగానికంటే ఎక్కువగా వచ్చిన వారిని విజేతగా ప్రకటిస్తారు.

టెన్షన్ టెన్షన్

ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఆ పార్టీల అభ్యర్థులు ఓటర్లను గోవా, కర్ణాటక తదితర ప్రాంతాల్లో క్యాంప్‌నకు తరలించారు. వారిని ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ఎన్నోపాట్లు పడ్డారు. దీంతో ఆ రెండు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌ఓ పెరుగుదల అభినందనీయం

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం



బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న పురుషోత్తం

తాండూరు టౌన్: సిబ్బంది కృషి ఫలితంగానే తాండూరు ఆర్టీసీ డిపో ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) పెరిగిందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. శనివారం తాండూరు డిపోను రీజనల్ మేనేజర్ రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ రామ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు, కండక్టర్ల కృషితోనే డిపో ఓఆర్ గణనీయంగా పెరిగిందన్నారు. ఆర్టీసీ ప్రగతి చక్రం సవ్యంగా సాగాలంటే సిబ్బంది తోడ్పాటు ఉండాలన్నారు. ఉద్యోగులందరూ విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచిత బస్సు పథకం ప్రారంభమైనప్పటి నుంచి బస్సుల్లో ఎక్కువ శాతం ప్రజలు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చే సంస్థ ఒక్క ఆర్టీసీయేనన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురికి ప్రశంసాపత్రాలు అందజేశారు. బస్టాండ్ దుకాణ సముదాయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సమత, సీఐ నిర్మల, సూపరింటెండెంట్ రవికిరణ్, వెల్ఫేర్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ వెంకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య, గీత

శంకర్‌పల్లి: రానున్న రెండు వారాలు మండలంలోని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 18గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతుల కల్పన కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకోని శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, వారికి ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించాలని, అవసరమైన చోట్ల మొరం వేసి గుంతలను పూడ్చాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 3 నుంచి 11వరకు బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన



శంకర్‌పల్లి: అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీలో ఎంపికైన రెండు ప్రభుత్వ పాఠశాలలను శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఫత్తేపూర్, రామంతపూర్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, టాయిలెట్స్‌ల పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో పనులు వేగంగా పూర్తి చేయాలని గుత్తేదారునికి సూచించారు. అలాగే, పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను కోరారు. పరిశీలనలో మున్సిపల్ ఏఈ, మేనేజర్ పాల్గొన్నారు.

ప్రేమ జంటకు పెళ్లి

కొందుర్గు: ఓ ప్రేమ జంటకు గ్రామపెద్దలు పెళ్లి చేశారు. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌కు చెందిన పత్తి నరేష్(21), అదే గ్రామానికి చెందిన బేబి(19) గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే, నాలుగు రోజుల క్రితం ఇద్దరు ఇంట్లో చెప్పకుండా గ్రామం నుంచి వెళ్లిపోయారు. శుక్రవారం కొందుర్గు పోలీసులను ఆశ్రయించారు. శనివారం గ్రామపెద్దలు కొందుర్గు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రేమ జంటకు పెళ్లి జరిపించారు.